కేబుల్ వైర్ల తొలగింపు
నిలిచిన ఇంటర్నెట్ సేవలు,
చానళ్ల ప్రసారం
కేబుల్ ఆపరేటర్ల నిరసన
మేడ్చల్ పట్టణంలో గందరగోళం
6


సర్వాయి పాపన్న గౌడ్
కృషి మరువలేనిది


పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అధికారులు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సబ్బండ వర్గాల సమానత్వం, వారి సంక్షేమం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఎనలేని కృషి చేశారని, బహుజనుల ఆత్మగౌరవానికి ఆయన ప్రతీక కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం ఐడీసీవో భవనంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్.. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌తో కలిసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాపన్నగౌడ్ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి, తెలంగాణ గడ్డపై దళిత, బహుజన, మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించారని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో మంగీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, బీసీ వెల్ఫేర్ అధికారి ఉపేందర్, జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 45 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా , ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పలు పాఠశాలల్లో పెయింటింగ్, మైనర్ రిపేర్ పనులు, బయోమెట్రిక్ హాజరు, ధాన్యం కొనుగోలు, విద్యుత్తు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

11,200 మెట్రిక్ టన్నుల యూరియా

జిల్లాలో ఆగస్టు నెలకు సంబంధించి 11,200 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం రాష్ట్ర మంత్రి తుమ్మల , సీఎస్ రామకృష్ణరావుతో యూరియా, ఎరువుల లభ్యతపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ , ఇప్పటి వరకు 4,250 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించినట్లు తెలిపారు.

ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుకు అనుకొని ఉన్న రూ.4 కోట్ల విలువైన అర ఎకరా ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేశారు. అంతా అయిపోయిందనుకున్నారు. అంతలోనే గుర్తించిన రెవెన్యూ అధికారులు చుట్టూ నిర్మించిన ప్రహరీని కూల్చి, ప్రభుత్వ భూమిగా సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ఐదారు నెలలు స్తబ్దుగా ఉన్న కబ్జాదారులు మళ్లీ ఆ భూమిపై కన్నేశారు. గ్రామ పెద్దలకు, అధికారులకు ముడుపులే ఇచ్చారో, పార్టీలు ఇచ్చారో తెలియదు. కానీ మళ్లీ ఆ భూమిని ఆక్రమించుకొని ప్రీ కాస్ట్ వాల్ నిర్మించి గేట్‌ను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు చోద్యం చూస్తుండటం గమనార్హం.


ఇటీవల ప్రభుత్వ భూమిలో వేసిన ప్రీకాస్ట్ వాల్

రూ.4కోట్ల భూమి..
హాంఫట్

దమ్మాయిగూడ పరిధిలోని యాద్గార్‌పల్లిలో ఇష్టారాజ్యం

- గతంలోనే ప్రహరీని కూల్చిన రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు
- ఐదారు నెలల తర్వాత మళ్లీ కన్ను
- గ్రామ పెద్దలు, అధికారులకు భారీగా ముడుపులు!
- మరోసారి ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేసిన కబ్జాదారులు
- చోద్యం చేస్తున్న రెవెన్యూ అధికారులు

కీసర, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా.. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామం(పడమర) రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 51, 53లో దాదాపు అర ఎకరా ప్రభుత్వ భూమి ఉంది. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఈ భూమి విలువ ఎంత లేదన్నా సుమారు రూ.4 కోట్లకు పైమాటే. దీంతో భూమికి ఆనుకొని భూములున్న ప్రైవేట్ వ్యక్తులకు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై కన్ను పడింది. దీంతో కబ్జాదారులు ముందుగా గ్రామ పెద్దలను మచ్చిక చేసుకునేందుకు ఫాంహౌస్ పార్టీలు, మందు, చిందు ఇలా అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో పాటు గ్రామంలో కొంత పలుకుబడి ఉన్న వ్యక్తులకు పెద్ద మొత్తంలో ముడుపులు సైతం చెల్లించినట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఈ విలువైన భూమి కబ్జాకు గురవుతుందని ఫిర్యాదులు రావడంతో అప్పటి ఆర్ఐ అన్వేష్, ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రహరీని జేసీబీ సహాయంతో కూల్చివేసి, ప్రభుత్వ భూమిగా


గతంలో ప్రభుత్వ భూమిగా సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మిగతా 8వ పేజీలో...

చర్యలు తీసుకుంటాం



యాద్గార్‌పల్లి వెస్ట్ సర్వే నంబర్ 51, 53లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. వరుస సెలవులు రావడంతో పరిశీలన చేసేందుకు వీలు పడలేదు. గతంలో కూడా అక్కడ ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగింది. చర్యలు తీసుకొని కూల్చివేతలు జరిపి సూచిక బోర్డు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చేసినా సహించేది లేదు.

-అశోక్, తహసీల్దార్, కీసర

నేడు శత రుద్రాభిషేకం

వికారాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): లోక కళ్యాణం కోసం తెలంగాణ జంగమ సమాజం, జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్‌లోని శ్రీమల్లికార్జున భవనంలో ఆరుద్ర నక్షత్ర సహిత మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ముద్ద భక్తవత్సలం, శివశంకర స్వామి తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమై 11 గంటల వరకు రుద్రాభిషేకం కొనసాగుతుందన్నారు. అనంతరం ఆరుద్ర నక్షత్ర సహిత మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం విశిష్టత, సనాతన హైందవ ధర్మరక్షణపై ప్రవచన కార్యక్రమం ఉంటుందని వారు చెప్పారు. సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

గణేశ్ మండపాల ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం, గణేశ్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్‌శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి కోరారు. ఈ ఆన్‌లైన్ నమోదు కేవలం భద్రత, బందోబస్తు ఏర్పాటు కోసం మాత్రమేనన్నారు. దీనికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రతీ మండపం సమాచారం అందుబాటులో ఉంటే అత్యవసర పరిస్థితుల్లో లేదా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా భద్రతా చర్యలు తీసుకోవడానికి పోలీసులకు సులభంగా ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


అలుగు పారుతున్న ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు

వీడని జడివాన

పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు

- మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో మోస్తరు వర్షం
- పరవళ్లు తొక్కిన బొంతకుంట, ఎరిమల్లెవాగులు
- ఘట్‌కేసర్‌లో 64.2మి.మీ, వికారాబాద్‌లో 13.8మి.మీ వర్షపాతం నమోదు
- యాలాల మండలంలో కూలిన ఇంటి గోడ
- జలకళను సంతరించుకున్న కాగ్నా నది


నాగారం బల్దియాలోని సాయి సంజీవనగర్ కాలనీలో..

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఆగస్టు 18: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపించాయి. మేడ్చల్ జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలువడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. అలాగే మేడ్చల్ పెద్ద చెరువులోకి పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో అలుగు పారుతోంది. గౌడవెల్లి నుంచి మేడ్చల్ పెద్ద చెరువు వరకు వరద నీరు ప్రవహించే కాల్వలు వంతెన పైనుంచి పొంగడంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. అలాగే పూడూరు, రావల్‌కోల్, అత్వేల్లి, డబీల్‌పూర్, గౌడవెల్లి గ్రామాల్లో పరిసర ప్రాంతాల నుంచి కాల్వల ద్వారా పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో చెరువులు నిండి పొంగే స్థితికి చేరుకున్నాయి. నాగారం, దమ్మాయిగూడ, మూడుచింతలపల్లి, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో భారీ వర్షం కురిసింది. నాగారం బల్దియాలోని బీఎంఆర్ ఎన్‌క్లేవ్, సాయి సంజీవనగర్ తదితర కాలనీల్లో భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆ రోడ్లు వాగులను తలపించాయి. జనాలు ఇంటి నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎగువ ప్రాంతమైన దమ్మాయిగూడ నుంచి వచ్చిన వరద రాంపల్లి చౌరస్తాలోని ప్రధాన రహదారిలో రెండు అడుగుల లోతుతో వరద ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.


గోవిందరావుపేటలో వర్షానికి కూలిన ఇల్లు

చెరువులను తలపించిన రోడ్లు

ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో 64.2 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. దీంతో ఎరిమల్లెవాగు, బొంతకుంట వాగులు ఉధృతంగా ప్రవహించాయి. చెరువులు, కుంటల్లో అడుగుకుపైగా నీళ్లు పెరిగాయి. వాగులపై ఉన్న అనకట్టలపై నుండి వరదనీరు పరవళ్లు తొక్కుతూ దిగువన ఉన్న ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులోకి చేరుతోంది. దీంతో లక్ష్మీనారాయణ చెరువు అలుగు పారుతోంది. గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో అలుగు వద్ద ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి, పూలు, పండ్లు సమర్పించారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉద్దెమర్రి వాగు పొంగి లోలెవల్ బ్రిడ్జి పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు

మిగతా 8వ పేజీలో...

కాగ్నా.. కళకళ



తాండూరులో కాగ్నా నది వరద నీటితో కళకళలాడుతోంది. భారీ నీటి ప్రవాహాన్ని చూసేందుకు తాండూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు వస్తుండడంతో కాగ్నానది పరిసరాలు సందడిగా దర్శనమిస్తున్నాయి. సోమవారం నది నీటి సుడులు తిరుగుతూ ప్రవహించడం గమనార్హం. ఈ నది నిండడంతో తాండూరు పట్టణానికి ఆరు నెలల వరకు నీటి సమస్య ఉండదని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

కనుల పండువగా రామలింగేశ్వర జాతర



దక్షిణ కాశీగా పేరుగాంచిన బషీరాబాద్ మండలంలోని నీళ్లపల్లి అటవీ ప్రాంతం లో ఏడు కొలనుల మధ్య వెలసిన ఏకాంబర రామలింగేశ్వర జాతరకు భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం చివరి సోమవారం నిర్వహించే ఈ ఉత్సవాలకు పలు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భక్త జనసందోహం నెలకొంది.

-బషీరాబాద్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి)

7

ఘట్‌కేసర్‌లో 5 కిలోల గంజాయి పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వాహనాలను తనిఖీ చేస్తుండగా మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పరిధిలోని చర్లపల్లిలో సోమవారం ఐదు కేజీల గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధి చర్లపల్లిలో సోమవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బైక్(టీఎస్ 07 జెఎం 8639)ను ఆపి సోదా చేస్తుండగా బైక్ వెనకాల కుర్చున్న అబ్దుల్ ముజీబ్ అనే వ్యక్తి పరారీ అయ్యాడు. దీంతో బైక్ నడుపుతున్న కిషోర్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో 5 కిలోల గంజాయి దొరికింది. కిషోర్ మాలిక్‌ను అదుపులోకి తీసుకోని విచారించగా ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి చర్లపల్లి పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిపాడు. ఈ మేరకు కిషోర్‌ను రిమాండ్ తరలించి గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముజీబ్‌ను త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

పకడ్బందీగా నవరాత్రోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

- గణేశ్ పండగకు పకడ్బందీగా ఏర్పాట్లు
- మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి
- కలెక్టరేట్‌లో పాపన్న గౌడ్‌కు ఘన నివాళి

మేడ్చల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వినాయక నవరాత్సోవాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. గణేశ్ నిమజ్జనాలకు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకొన్ని చేయాల్సిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో అధిక సంఖ్యలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. చెరువుల వద్ద భారీ క్రేన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా స్థాయి

మిగతా 8వ పేజీలో...

తాండూరులో కుర్చీలాట

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు ఇద్దరు అధికారుల పోటీ
- జవాన్లు, కార్మికులకు ఇరువురి ఆదేశాలు
- అయోమయంలో బల్దియా సిబ్బంది
- ఎమ్మెల్యే చెంతకు పంచాయితీ


తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు కుర్చీలాట కొనసాగుతుంది. ఒక సీటుకు ఇద్దరు అధికారులు పోటీ పడ్డారు. ఇక్కడ పర్మినెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో ఇన్‌చార్జిగా జూనియర్ అసిస్టెంట్ వెంకటయ్యను ఈ నెల 1న ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 13న ఇదే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సంబంధించి మరో ఉత్తర్వును కమిషనర్ జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో తాండూరు మున్సిపాలిటిలోని 36 వార్డులను విభజన చేస్తూ ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు. ఈ అంశంపై మున్సిపాలిటిలో చర్చనీయంగా మారింది.

గతంలోనే తారుమారు..

గతంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటయ్య ఇన్‌చార్జిగా కొనసాగుతుండగా ఆయనను తప్పించి జూనియర్ అసిస్టెంట్ ఉమేశ్‌కు ఆరు నెలల క్రితం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు

మిగతా 8వ పేజీలో...



పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లిస్తాం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ త్వరలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సోమవారం వచ్చిన పలువురు పేదలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, పనులు పూర్తి చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని తెలిపారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పేదలు



విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఉపాధ్యాయులు తమ వంతుగా కృషి చేయాలని బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బూడిద రాంరెడ్డి అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ క్రాస్ రోడ్డు మైదానంలో రెండ్రోజులపాటు నిర్వహించిన వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్, డ్రగ్స్‌లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువులపై శ్రద్ధ చూపాలని, ఎంచుకున్న లక్ష్యం కోసం నిరంతరం శ్రమించినప్పుడే భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 44 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1,320 మంది విద్యార్థులు హాజరయ్యారు. 142 టీంలు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నాయి. బాలికల వాలీబాల్‌లో జెడ్పీహెచ్‌ఎస్ యాచారం మొదటి స్థానంలో నిలువగా జెడ్పీహెచ్‌ఎస్ రంగాపూర్ రెండో స్థానంలో నిలిచాయి. బాలుర వాలీబాల్‌లో జెడ్పీహెచ్‌ఎస్ రంగాపూర్ మొదటి స్థానంలో, జెడ్పీహెచ్‌ఎస్ జాపాల రెండో స్థానంలో నిలిచాయి. బాలికల కబడ్డీలో జెడ్పీహెచ్‌ఎస్ రాయపోల్ మొదటి స్థానంలో, ఇబ్రహీంపట్నం బాలికల ఉన్న పాఠశాల రెండో స్థానంలో నిలిచాయి. అలాగే బాలుర కబడ్డీలో జెడ్పీహెచ్‌ఎస్ రాయపోల్ మొదటి స్థానంలో, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాల రెండో స్థానంలో నిలిచాయి. బాలికల ఖోఖోలో జెడ్పీహెచ్‌ఎస్ చింతపట్ల మొదటి స్థానంలో, జెడ్పీహెచ్‌ఎస్ దండుమైలారం రెండో స్థానంలో నిలిచాయి. బాలుర ఖోఖోలో జెడ్పీహెచ్‌ఎస్ చింతపట్ల మొదటి స్థానంలో, టీపీఎస్ ఆరుట్ల రెండో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా ఉప్పరిగూడ గ్రౌండ్ నుంచి శేరిగూడ వరకు క్రీడాకారులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.


ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు షీల్డుతోపాటు బహుమతులు అందజేస్తున్న బూడిద రాంరెడ్డి

మొగిలిగిద్ద పాఠశాలలో

అభివృద్ధి పనులు ప్రారంభించండి

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించాలని గ్రామస్తులు, ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్సీ కోదండరాంతో కలిసి విద్యా కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జనవరి 30న సీఎం రేవంత్‌రెడ్డి మొగిలిగిద్ద గ్రామాన్ని సందర్శించారని తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన పాఠశాల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. అలాగే రెగ్యులర్ ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, 11 మంది ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపుతున్నారని, ఆ డిప్యూటేషన్లు నిలిపివేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ నిధులు మంజూరుకు నాబార్డు అధికారులతో మాట్లాడారు. మొగిలిగిద్ద పాఠశాలను సందర్శించి సమాచారం సేకరించాలని డీఈఓను ఆదేశించారు. కేజీబీవీలో అదనపు కోర్సు మంజూరు చేయాలని కోరారు. గ్రామస్తులు శ్యాం సుందర్, రాజు, దయాసాగర్ ఉన్నారు.


కమిషనర్‌తో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం, గ్రామస్తులు

అట్టహాసంగా వాలీబాల్ పోటీలు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో అండర్-15 బాలబాలికల 69వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండ్రోజులపాటు జరగనున్న ఈటోర్నీని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ప్రారంభించారు. ములుగు జిల్లా మినహా 32 జిల్లాల నుంచి 768 మంది క్రీడాకారులు, 128 మంది కోచ్ మేనేజర్లు ఈటోర్నీలో పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ ఈ క్రీడలకు ఆతిథ్యమిచ్చిన గురుకుల విద్యాపీఠ్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 25 నుంచి పూణేలో జరుగబోయే జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. కార్యకమంలో మండల విద్యాధికారి హీర్యానాయక్, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ డి.శ్రీనపివాస్‌రావు, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, క్రీడల అబ్జర్వర్ వెంకట్‌నారాయణ పాల్గొన్నారు.




బెలూన్లు ఎగరవేసి క్రీడలను ప్రారంభిస్తున్న డీఈవో సుశీందర్‌రావు తదితరులు









మంతన్‌గౌరెల్లి పాఠశాలకు భవనాలు నిర్మించాలి

యాచారం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతన్‌గౌరెల్లిలో ప్రైమరీ పాఠశాల తరగతి గదులు పూర్తిగా శిథిలమయ్యాయని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు చందూనాయక్, భాస్కర్‌నాయక్, జంగయ్య, రవి అన్నారు. పాఠశాల భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొందని, తక్షణమే భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ సోమవారం రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ పూర్ణచందర్‌రావు., కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు థావ్‌నాయక్, గణేష్ తదితరులున్నారు.

కేబుల్ వైర్ల తొలగింపు

- నిలిచిన ఇంటర్నెట్ సేవలు
- కేబుల్ ఆపరేటర్ల నిరసన

మేడ్చల్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్ర జ్యోతి): అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ప్రైవేటు సంస్థలకు చెందిన కేబుల్ వైర్లను సోమవారం విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. ఇటీవల నగరంలోని రామంతపూర్ ఘటన నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు అనధికారికంగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగించడానికి విద్యుత్ శాఖ అధికారులు రంగంలో దిగారు. ఈ క్రమంలో మేడ్చల్ పట్టణంలోని వీధుల్లో, కాలనీల్లోని విద్యుత్ స్తంభాలకు కుప్పలు తెప్పలుగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగించారు. దీంతో పట్టణంలో కేబుల్ ద్వారా సరఫరా అయ్యే ఇంటర్నెట్ సేవలు, కేబుల్ ఛానళ్ల ప్రసారం పూర్తిగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కొందరు కేబుల్ ఆపరేటర్లు విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. లక్షల రూపాయలు విలువ చేసేకేబుల్‌లను తొలగించడంపై మండిపడ్డారు. ఈ విషయమై మేడ్చల్ ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు వ్యక్తులు కేబుళ్లను ఏర్పాటు చేయడానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. నిబంధనకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కేబుళ్లను తొలగించామని తెలిపారు. ఇదిలా ఉండగా, విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా కేబుల్ వైర్లను తొలగించటాన్ని నిరసిస్తూ మంగళవారం(నేడు) స్థానిక ప్రైవేటు కేబుల్ ఆపరేటర్లు నిరసన చేపడుతున్నట్లు ప్రకటించారు.


స్తంభాల నుంచి కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

రాకపోకలను పునరుద్ధరించాలి

శామీర్‌పేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అరునెలలుగా అక్రమంగా రోడ్డును మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రాకపోకలను పునరుద్ధరించాలని రెడ్డి కాలనీవాసులు డిమాండ్ చేశారు. తూంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్‌యాదవ్ ఆధ్వర్యంలో రెడ్డి కాలనీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఆ కాలనీవాసులు తూంకుంట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రెడ్డి కాలనీలో గల వెంచర్ లేఅవుట్‌లోని రోడ్డును ఆక్రమించుకున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేదంటే కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎద్దు నాగేశ్‌యాదవ్, రెడ్డి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి ఉన్నారు.



ఆందోళన చేస్తున్న రెడ్డి కాలనీవాసులు, నాగేశ్‌యాదవ్



వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

వికారాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకుని వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అంతకు ముందు రుద్రాభిషేకం, దాత సహకారంతో నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవానికి భక్తులుతరలిరాగా, వీరశైవ సమాజం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ముగిసిన సిద్దులగుట్ట బ్రహ్మోత్సవాలు



రాంచందర్‌రావు, పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

శంషాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీ వెండికొండ సిద్దేశ్వరస్వామి(సిద్దులగుట్ట) బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు పంతంగిరాజ్ భూపాల్‌గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని పూలమాలలతో సన్మానించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన పూజారి మాడుపతి నరేందర్ నిర్వహించిన అగ్నిగుండాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పూజారులు నందీశ్వర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

తాండూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వైద్యాధికారులకు సూచించారు. సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవికి, తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునితతో ఫోన్‌లో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల గురించి ఆరా తీశారు. డెంగ్యూ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని దీనిపై అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. మందుల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలియజేశారు.

బంగారు తాపడ నాగాభరణం విరాళం



నాగాభరణం అందజేస్తున్న సాద నర్సింహా రెడ్డి కుటుంబ సభ్యులు

కీసర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్ట ఆలయానికి సికింద్రాబాద్‌కు చెందిన సాద నర్సింహారెడ్డి పుష్పలత దంపతులు బంగారు తాపడ నాగాభరణం సోమవారం విరాళంగా అందజేశారు. రూ.6.50లక్షల విలువచేసే బంగారు తాపడ నాగాభరణం అందజేయడం అభినందనీయమని ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ అన్నారు. దాతలు స్వామివారికి నాగభరణంతో శ్రీమహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ మహామండపంలో ఆలయ నిర్వాహకులకు నాగాభరణం అందజేశారు. అదే విధంగా శ్రావణ మాసం పురస్కరించుకొని చివరి సోమవారం కావడంతో భక్తులు అధికసంఖ్యల్లో విచ్చేసి స్వామివారికి అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు జూపల్లి సాయిలు, కందాడి రాజిరెడ్డి, రెడ్డబోయిన ప్రవీణ్, నల్లా మధుసూధన్‌రెడ్డి, పోశబోయిన రాజు యాదవ్, కె.కృష్ణారెడ్డి, ప్రధాన అర్చకుడు బలరాం శర్మ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం



సమావేశంలో నివేదికలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

బొంరాస్‌పేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 47 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అధికారులు నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలో జరిగిన వివిధ పనులపై సామాజిక తనిఖీ బృందం వారం రోజుల పాటు తనిఖీ చేసిన నివేదికను బహిరంగ సమావేశంలో వివరించారు. 10 పంచాయతీల నివేదికలను సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఉపాధిహామీ ఏపీడీ సరళ, ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింహులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, ఎంపీడీవో వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా గరుడ వాహన సేవ



చేవెళ్లలో వేంకటేశ్వర స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

చేవెళ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రావణ సోమవారం సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ప్రతి ఏడాది సంప్రదాయ పద్ధతిలో నిర్వహించే గంపజాతర సోమవారం ఘనంగా జరిగింది. చేవెళ్ల గ్రామస్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోనే వంటలు చేసుకుని రోజంతా గడిపారు. అనంతరం స్వామి వారిని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో దేవాయల ఫౌండర్ ట్రస్టీ దేవుని వామనాచార్యులు, ఈవో నరేందర్, సిబ్బంది సుకేందర్, పూజారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్, అధికారులు

మేడ్చల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం మంత్రి తుమ్మల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా సరఫరా పరిస్థితులను వివరించారు. యూరియా నిల్వలపై పటిష్ట పర్యవేక్షణ తీసుకుంటున్నామన్నారు. యూరియా వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. డీలర్లపై ప్రత్యేక దృష్టిపెట్టి తగినచర్యలు చేపడుతున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో హరిప్రియ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ సంబురాలు



ఘట్‌కేసర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో గల బ్యూటినెస్ట్ కాలనీలో ఆదివారం రాత్రి తీజ్ సంబురాలు ఘనంగా నిర్వహించారు. గిరిజనుల్లోని వివాహం కాని యువతులు ఈవేడులకను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ధాన్యపు బుట్టలను(బతుకమ్మలను) చెరువులో నిమజ్జనం చేస్తారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గోర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నృత్యాలు చేస్తూ భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. రవినాథ్, పురుషోత్తం నాయక్, రాములు నాయక్, నెహ్రూ నాయక్, మోతీలాల్ నాయక్, డీజీ నాయక్, ఉమ్లా నాయక్, కిరణ్, సంతోష్, చిట్టిబాబు, నరేష్ పాల్గొన్నారు.

కనుల పండువగా రామలింగేశ్వర జాతర

● భక్తిశ్రద్ధలతో రథోత్సవం ● హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

బషీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన మండలంలోని నీళ్లపల్లి అటవీ ప్రాంతంలో ఏడుకొండల మధ్య వెలసిన ఏకాంబర రామలింగేశ్వరుడి జాతరకు భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం చివరి సోమవారం నిర్వహించే ఈ జాతరకు భక్తులు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో జాతరలో భక్త జనసందోహం నెలకొంది. ఈ ఆలయ పుష్కరణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇక్కడి రామలింగేశ్వరుడి దర్శనం అనంతరం భక్తులు ఆలయం పక్కనే కొలువై ఉన్న యాకుబ్‌సాబ్ దర్గాను కోనేటి నీటిలోంచి వెళ్లి దర్శించుకున్నారు. ధర్మదర్శనం, ప్రత్యేక దర్శనాలకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయ చైర్మన్ పి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి పరమశివుడి విగ్రహం, కలశాన్ని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం మహాశివుడి విగ్రహంతో రథోత్సవం కనులపండువగా జరిగింది. ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తండ్రి విఠల్‌రెడ్డి హాజరవగా, ఆలయ కమిటీ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలకు చైర్మన్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. సుధాకర్‌రెడ్డి, రుక్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూర్యానాయక్, వీరారెడ్డి, రామక్రిష్టారెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కరుణం పురుషోత్తంరావు, అజయ్‌ప్రసాద్, ఎస్.వెంకటేష్, చందర్‌నాయక్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



జినుగుర్తిలో పూజలందుకున్న రామలింగేశ్వరస్వామి



అంబురామేశ్వర ఆలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి



రథోత్సవంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

వైభవంగా అంబురామేశ్వర స్వామి జాతర

పెద్దేముల్: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తట్టెపల్లి సమీపంలోని శ్రీఅంబురామేశ్వర స్వామి జాతర వైభవంగా జరిగింది. ఉత్సవాలకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వికారాబాద్ జిల్లా వాసులే కాకుండా పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రం నుండి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. రోజంతా మోస్తరు వర్షం కురుస్తున్నా భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. అంబురామేశ్వరస్వామిని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్, సొసైటీవైస్‌చైర్మన్ అంజిలయ్య, నాయకులు గోపాల్, అంజయ్య, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

జినుగుర్తి మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

తాండూరు రూరల్: జినుగుర్తి రామలింగేశ్వరస్వామి ఆలయం 42వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధారాసింగ్, పురుషోత్తంరావు, ఉత్తంచంద్, రవీందర్‌గౌడ్, వడ్డె శ్రీనివాస్, రాంలింగారెడ్డి పాల్గొన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న గౌడ్

శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

కేశంపేట/చేవెళ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మొఘల్ సుబేదార్లు చేస్తున్న అరాచకాలకు ఎదురొడ్డి బడుగు జీవుల పక్షాన పోరాడిన యోధుడు సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ అని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని కేశంపేట మండలం సంగెం గ్రామంలో జావాజీ నాగభూషణం గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని సోమవారం స్వామి గౌడ్, తూళ్ల వీరేందర్ గౌడ్ ప్రారంభించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత సైన్యం ఏర్పాటు చేసుకొని సుబేదార్లపై తిరుగుబాటు చేసి వరంగల్ ప్రాంతాన్ని 30 సంవత్సరాలు ఏలిన ఘనత పాపన్నదేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, అశోక్ గౌడ్, బుర్ర తిరుమలేష్ గౌడ్, పెండ్లిమడుగు వంశి, కందూరి చౌదరయ్య గౌడ్, పుండరీకం గౌడ్, మహేందర్ గౌడ్, సట్లపల్లి మహేందర్, అనీల్ గౌడ్, మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.



కేశంపేట: మాట్లాడుతున్న స్వామిగౌడ్

పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేవెళ్ల మున్సిపాల్ అధ్యక్షుడు బుయ్యాని శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన చేవెళ్ల మండల కేంద్రంలోని పాపన్నగూడ్ విగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, పార్టీల నాయకులతోపాటు ఆయా కుల సంఘాల నాయకులు వేర్వేరుగా పూలమాలాలు వేసి నివాళులరిపంచారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు దేరవ వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ సేవలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాజ్యలక్ష్మి, బాల్‌రాజ్, విజయలక్ష్మి, సున్నపు వసంతం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, రామస్వామి, సుధాకర్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.



చేవెళ్ల: పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మున్సిపల్ కమిషనర్‌ను తొలగించాలి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 18(ఆంధ్యజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలకు మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డు కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేయొద్దని ఆదేశాలు జారీ చేసిన కమిషనర్ మొయిజుద్దీన్‌ను పదవీ నుంచి తొలగించాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కేఎస్ రత్నం డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని తొమ్మిది వార్డు కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయనందుకు బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం అజీజ్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంతపాలన సాగిస్తున్న కమిషనర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కమిషనర్ కార్యాలయంలో లేకపోవడంతో మొయినాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్‌కుమార్ గౌడ్, గున్నాల గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎల్లని వెంకటేష్ గౌడ్, తూర్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గౌడ హక్కుల పరిరక్షణ సమితి

జిల్లా కార్యదర్శిగా ముకుందంగౌడ్

చేవెళ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గౌడకుల హక్కుల పరిరక్షణ సమితి రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ముకుందంగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేపట్ల మల్లేష్‌గౌడ్ చేతులు మీదుగా ముకుందం గౌడ్ నియామకపత్రం అందుకున్నారు. అలాగే చేవెళ్ల మండల అధ్యక్షుడిగా బొబ్బిలి కుమార్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందని, రాష్ట్ర నాయకుల నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



బోనాల వేడుకల్లో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

కడ్తాల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌తో కలిసి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. వివిధ వేషధారణలో ఆకట్టుకున్న కళాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, మంగళపల్లి నరసింహ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరుడి పవిత్రోత్సవం



పవిత్రమాలలతో మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, అంజయ్యయాదవ్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పెద్ద జానమ్మపేట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవం జరిగింది. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో మహాకుంభ ప్రోక్షణ, పవిత్రోత్సవ నాలుగో రోజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు ఆలయ ప్రధాన గర్భగుడిలోని వేంకటేశ్వరుడి విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం యాగశాల నుంచి బక్కని నర్సింహులు,అంజయ్యయాదవ్‌తోపాటు పరిగి వెంకటసాయిశ్వర్‌రెడ్డి పవిత్ర మాలలు, రామాలయంలోని కళశాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, గర్భగుడిలోని వేంకటేశ్వరుడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా, బండారి రమేష్, గంధం ఆనంద్, ఈటె గణేష్, ఒగ్గు కిషోర్, ప్రతాప్‌రెడ్డి, కానుగు అంతయ్య, కక్కునూరి పెంటయ్య, గజవాడ నర్సింహులు, కానుగు రాంభూపాల్, లింగారం కుమార్‌గౌడ్, డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి, లష్కర్ అంజనేయులు, మధు పాల్గొన్నారు.

హరిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లును హరిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో 50వేల పండ్లు, పూల మొక్కలను నాటాలనే లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 6, 12 వార్డుల్లో సోమవారం ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ ఇంటికి ఆరు చొప్పున మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలు కావాల్సిన వారు స్థానిక మున్సిపల్ వార్డు అధికారులను సంప్రదించాలని సూచించారు.

పింఛన్లు పెంచకపోతే మహాగర్జన

● ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

శంషాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 9వ తేదీలోగా పింఛన్లు పెంచకపోతే పరేడ్‌గ్రౌండ్‌లో పింఛన్‌దారులతో మహాగర్జన నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని బేగం పంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన పింఛన్‌దారుల సభలో పాల్గొని మాట్లాడారు. పింఛన్లు పెంచుతామని గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి నమ్మకద్రోహం చేశారని ఆరోపించారు. సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చకపోతె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. భూస్వాములకు రైతు భరోసా పేరుతో వేల కోట్లు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉపేందర్, యాదగిరి, నరసింహ, భాను ప్రసాద్, మహేష్, రత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లిలో అక్రమ భవన నిర్మాణాలకు సహకరిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం గుర్రాల రాజు గ్రామ వాసి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి ఖాజిగూడ రెవెన్యూ శివారులో 12 నుంచి 17, 20, 25, 33 నుంచి 38 గల సర్వే నంబర్లలో 1.30 గుంటల భూమిని, పక్కన కొనుగోలు చేసిన తన భూమిలో కలిపి ఓ బిల్డర్ లేఔట్ చేసినట్లు బాధితుడు అధికారులకు మొరపెట్టుకున్నాడు. అడ్డుకునేందుకు వెళ్లిన తన కుటుంబసభ్యులపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయాడు. నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని హైకోర్టు ఆదేశాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా అధికారులు స్పందించిన్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

రూ.4కోట్ల భూమి.. హాంఫట్

(ఐదో పేజీ తరువాయి)

సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. కాగా, ఈ బోర్డులో రెవెన్యూ అధికారులు గ్రామం, సర్వే నంబర్ సూచించకపోవడం గమనార్హం. దీంతో కబ్జాదారులు ఆ భూమి జోలికి వెళ్లలేదు. కాలం గడుస్తున్నా కొద్ది కబ్జాదారుల కన్ను తిరిగి ఆ భూమి మీద పడింది. ఐదారు నెలల అనంతరం మళ్లీ ఎలాగైనా దక్కించుకోవాలన్న దురాశతో మళ్లీ ప్రభుత్వ భూమిలో ప్రీకాస్ట్ వాల్ నిర్మించారు. దీంతో దీన్ని గుర్తించిన కొంత మంది గ్రామస్తులు ప్రభుత్వ భూమి తిరిగి కబ్జా చేశారని మౌఖికంగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన గ్రామస్తులకు, రెవెన్యూ అధికారుల నుంచి వచ్చిన సమాధానం విని బిత్తరపోయారు. దీని వెనకాల పెద్ద, పెద్ద మనషులు ఉన్నారు. ఈ ఒక్క విషయం వదిలేయండి బయ్ అంటూ మండల రెవెన్యూ అధికారి సమాధానం ఇవ్వడంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. త్వరలో కబ్జా చేసిన వారికే అనూకూలంగా ప్రొసిడింగులు ఇస్తాం మీరేం చేయలేరంటూ అధికారులు సమాధానం ఇస్తుండటంతో గ్రామస్తులు ఆందోళనలో పడ్డారు. ఈ వ్యవహారంతో గ్రామపెద్దలతో పాటు, రెవెన్యూ అధికారులు కూడా కబ్జాదారులకు సహకరిస్తున్నారనే విషయం తేటతెల్లమైంది. అధికారులు కూడా కబ్జాదారులు ఇచ్చిన మంచి, మర్యాదలను అందిపుచ్చుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రయోజనాలకు వినియోగించాల్సిన భూమిని ఇలా కబ్జాకోరులకు దోచుకునేలా సహకరించడం అధికారులకు సమంజసం కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సిఫారసు

గతంలో ఈ ప్రభుత్వ భూమిలో ఇక్కడ కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సిఫారసు చేశారు. దాని కోసం అధికారులు పనులు కూడా చేశారని, ఇంతలో ఏమైందో తెలీదు. ప్రభుత్వ భూమి కబ్జా అయింది. భూభారతి చట్టంతో రైతులతో పాటు, ప్రభుత్వ, సీలింగ్ భూములు రక్షించబడతాయని ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి ప్రయత్నిస్తుంటే, రెవెన్యూ అధికారుల ఉదాసీనతతో ప్రజా ప్రభుత్వం సంకల్పం నీరుగారే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కబ్జాకు గురౌతున్న విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా నేతాజీ వర్ధంతి



ఘట్‌కేసర్ రూరల్: సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మేడ్చల్ టౌన్/ఘట్‌కేసర్ రూరల్/కొడంగల్ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) నేతాజీ సుభాష్ చంద్రబోస్ 80వ వర్ధంతిని సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మోహన్ రెడ్డి మల్లికార్జున్ ముదిరాజ్ పాల్గొన్నారు. అదేవిధంగా మేడ్చల్, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో నేతాజీ వర్ధంతిని నాయకులు, యువజన సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ఘట్‌కేసర్‌లోని ఘనాపూర్‌లో కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరమేశ్‌గౌడ్, సురేశ్‌నాయక్, శంకర్‌గౌడ్, మల్లేశ్, వికాష్‌గౌడ్, మనోజ్‌గౌడ్, మణి, వంశీ తదితరులు పాల్గొన్నారు. కొడంగల్‌లోని ఇండస్ వ్యాలీ పాఠశాలలో సోమవారం నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్లు



ధారూరు: వరద ప్రవాహానికి దెబ్బతిన్న వంతెన

ధారూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ధారూరు మండలంలోని రుద్రారం-నాగసమందర్ గ్రామాల మధ్య రోడ్డుపై ఉన్న వంతెన మట్టి కోసుకుపోయి రంధ్రాలు పడింది. దీంతో సోమవారం వరద నీరు వంతెన పై నుంచి ప్రవహించి రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం మండల స్థాయి అధికారులు మొక్కుబడిగా వంతెన వద్దకు వచ్చి పరిశీలించి వెళ్లారని స్థానికులు తెలిపారు. వంతెన మరమ్మతులు చేపట్టాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

కులకచర్ల: 'రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ముజాహిద్‌పూర్ బీటీ రోడ్డు నుంచి అల్లాపూర్‌కు వెళ్లే దారిలో పడిన రంధ్రాన్ని సోమవారం పరిశీలించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో ఫోన్ ద్వారా మాట్లాడగా నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వారి వెంట పీఆర్ ఏఈ మణికుమార్, గోపాల్‌నాయక్, షైమునాబేగం ఉన్నారు.


జిల్లా ఆస్పత్రి ఎదుటే మురుగు



తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిలిచిన మురుగు

తాండూరు: ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే ఆస్పత్రి ముందే మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో సోమవారం ఆస్పత్రి వచ్చే రోగులు దుర్వాసనతో ఇబ్బంది పడ్డారు. తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఎదుట వరద నీటితో పాటు మురుగు నీరు రోడ్డుపై ప్రవహించింది. మురుగునీరు రోడ్డెక్కడంతో పాదచారులు, వాహనదారులు పడరాని పాట్లుపడ్డారు. ఈ నీరు నిల్వకుండా చూడాలని గతంలో కలెక్టర్, ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ ఆరునెలలుగా ఈ సమస్య పరిష్కారం కావడంలేదని స్థానికులు చెబుతున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కులకచర్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పాలకవర్గాన్ని మరో ఆరు నెలలు పొడిగించడంతో సోమవారం కులకచర్లలో సొసైటీ చైర్మన్ మొగులయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి



వికారాబాద్: పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు మల్లికార్జున్, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు



పరిగి: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, నాయకులు

గోల్కొండ కోటపై మొదటగా జెండా ఎగరవేసి బహుజన రాజ్యాన్ని స్థాపించిన బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని సోమవారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తాండూరు:సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్, గౌడసంఘం ప్రతినిధులు →





బంట్వారం: పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న శ్రీనివాస్, జగదీ శ్వర్, అంజయ్య తదితరులు



చౌడాపూర్: కన్మాన్‌కాల్వలో నివాళులర్పిస్తున్న రాఘవేందర్, మొగులయ్య, గోపాల్ తదితరులు



ఘట్‌కేసర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



దుద్యాల: చిలుముల్‌మైలారంలో పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో గ్రామస్తులు



దౌల్తాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పకడ్బందీగా నవరాత్రోత్సవాలు

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు, మున్సిపాల్టీల కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పాపన్న జీవితం ఆదర్శనీయం

సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మను చౌదరి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాపన్న సేవలను గుర్తు చేస్తూ ఆయన జీవితం ఆదర్శనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు వినోద్, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 65 దరఖాస్తులు

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియలతో కలిసి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. కాగా, ప్రజావాణిలో మొత్తం 65 దరఖాస్తులు స్వీకరించారు.

'డబుల్' ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలి



రిలే నిరాహార దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు

కీసర రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు జే.నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలనే డిమాండ్‌తో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, నర్సింగ్‌రావు, నాయకులు పరశురాం, మోహన్, యాస్మిన్, ఎండీ పాషా, పి.నాగరాజు బి.మొజస్, బి రమణ, ఆరిఫ్, జ్ఞానేశ్వర్, చింతల అశోక్, కంబాల పూజ పాల్గొన్నారు.

వీడని జడివాన

(ఐదో పేజీ తరువాయి)

బార్‌కేడ్లను ఏర్పాటు చేసి అక్కడి నుంచి రాకపోకలను నిలిపివేశారు. అలాగే అక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టారు. రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్ జిల్లాలో వికారాబాద్, మర్పల్లి, మోమిన్‌పేట్, నవాబ్‌పేట, కోట్‌పల్లి, బంట్వారం, పెద్దేముల్, ధారూరు, యాలాల్, తాండూరు, పూడూరు, పరిగి, దోమ, బొంరాస్‌పేట్, దుద్యాల, బషీరాబాద్, కులకచర్ల, చౌడాపూర్, యాలాల్, కొడంగల్ మండలాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి నుంచి విరామం లేకుండా వర్షం కురవడంతో వాగులు, వంకలు నిండుగా ప్రవహించాయి. మూసీ నదితో పాటు పలు వాగుల్లో వరద ఉధృతి కొనసాగింది. రాత్రి 8 గంటల వరకు జిల్లాలో వికారాబాద్‌లో 13.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.



మూడుచింతలపల్లి: ఉద్దెమర్రి వాగు లోలెవ్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తున్న వరద

యాలాల మండలంలో..

యాలాల మండంలోని గోవిందరావుపేటకు చెందిన నజీర్ ఆదివారం రాత్రి కుటుంబంతో కలిసి తన ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఆ సమయంలో కురిసిన భారీ వర్షానికి ఇల్లు ఒక పక్క కూలిపోయింది. గోడ కూలిన భారీ శబ్దానికి వారు లేచి చేసి ఆందోళనకు గురయ్యారు. పెను ప్రమాదం తప్పిందని వారు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే కొడంగల్ మండల పరిధిలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పలు గ్రామాల్లో పంట పొలాల్లో వరద నీరు చేరడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పెద్దేముల్ మండలంలోనూ రోజువారి కార్యక్రమాలకు వర్షం ఆటంకం కలిగింగించింది. శ్రావణమాసం చివరి సోమవారం రోజు నిర్వహించిన అంబురామేశ్వర జాతరకు వర్షం వచ్చినా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వర్షం పడుతున్నా తడవకుండా ఉండేందుకు గొడుగులు పట్టుకుని దైవదర్శనానికి క్యూలో నిలబడి దర్శనం చేసుకున్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



మోమిన్‌పేట్: రామలింగేశ్వరస్వామి గుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మోమిన్‌పేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నందివాగు ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న గుండంలో స్నానాలు ఆచరించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

పార్వతీ పరమేశ్వర ఆలయంలో..

బొంరాస్‌పేట్: నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులోని పార్వతీ పరమేశ్వర ఆలయంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాతి గుండు కింద వెలిసిన శివలింగానికి పూజలతో గుండుపై వరదపాశం పోశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర అలంకరణలో శివుడు

తాండూరు: తాండూరులోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి ఆలయంలోని శివుడిని శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ఏపీలోని కడప జిల్లా రాయచోటి పట్టణంలో వెలసిన వీరభద్రేశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పోట్లిమహారాజ్, నగరేశ్వర, చెరువెంటి ఈశ్వరాలయం, భవానినగర్, రామలింగేశ్వర పాతతాండూరు వెంకటేశ్వర, కోటేశ్వరాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు కుమారస్వామి తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం చేపట్టారు. శ్రావణమాస భజన కార్యక్రమాలు నిర్వహించారు.



బొంరాస్‌పేట్: వరదపాశం పోస్తున్న భక్తులు

పాంబండకు పోటెత్తిన భక్తులు

కులకచర్ల: బండవెల్కిచర్ల పాంబండ ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం చిన్న జాతర సందర్భంగా ఉదయం నుంచి భక్తులు గుండంలో స్నానం చేసి శ్రీ రామలింగేశ్వరస్వామి దర్శనం కోసం బారులు తీరారు. సాయంత్రం ఎడ్ల బండ్లు తిరిగే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ షైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య దగ్గరుండి పర్యవేక్షించారు.



కులకచర్ల: పాంబండ ఆలయం చుట్టూ తిరుగుతున్న ఎడ్ల బండ్లు

సంక్షిప్తంగా..

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పరిగి: పరిగిలోని ఇండస్‌వ్యాలీ స్కూల్‌లో సోమవారం శ్రీకృష్ణాజన్మష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రధానాచార్యాలు సునీల్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కొడంగల్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు వేణుగోపాల్, వెంకటయ్య, నర్సప్ప తదితరులు సోమవారం హైదరాబాద్‌లో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిశారు. బీసీ డీ నుంచి ఏ గ్రూపులోకి మార్చాలని, జీవో నెం.15 అమలు చేయాలని కోరారు.

మేడ్చల్ ఐటీఐలో సీట్ల భర్తీకి ఇంటర్వ్యూలు

మేడ్చల్ టౌన్: మేడ్చల్ పారిశ్రామిక వాడలో వివిధ ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.హనుమా నాయక్ తెలిపారు. విద్యార్థులు నేరుగా తమ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

దోమ: ఇందిరమ్మ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో గ్యమానాయక్ తెలిపారు. రాకొండలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు.

వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలి

మర్పల్లి: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వినాయక విగ్రహాల ప్రతిష్టాపన, మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సొంత డబ్బులతో చెట్ల తొలగింపు

నవాబుపేట: మార్కెట్ గోదాం నుంచి నవాబుపేట ప్రధాన రోడ్డు పెట్రోల్ బంక్ వరకు రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలను సొంత డబ్బులతో పులుమామిడి గ్రామానికి చెందిన రత్నమొల్ల రవీందర్‌రెడ్డి సోమవారం జేసీబీ సాయంతో తొలగించారు.

ప్రభుత్వ పాఠశాలలో షూస్ పంపిణీ

కీసర: నాగారం మున్సిపల్ పరిధి కరీంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో దాతలు విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. కరీంగూడ గ్రామానికి చెందిన సింగిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు షూస్, సాక్స్ విరాళంగా అందజేయగా, పోగుల లత బీరువా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

23న మెగా రక్తదాన శిబిరం

కొడంగల్: ఈ నెల 23న కొడంగల్ పట్టణంలోని ఓంశాంతి భవనంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఓం శాంతి భవనం బ్రహ్మకుమారీస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వబంధుత్వ దినోత్సవంలో భాగంగా ఈశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9441345499 సెల్ నంబరుకు సంప్రదించాలని కోరారు.

మురుగు కాలువకు ప్రత్యామ్నాయం ఆలోచించండి

కీసర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కీసరలో ప్రారంభించే నవోదయ పాఠశాలకు సంబంధించిన డ్రైనేజ్ వ్యవస్థకు ప్రత్యామ్నాయం ఆలోచించాలని రజకులు అధికారులను కోరారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలకు సంబంధించిన మురుగు కాలువకు సంబంధించిన పైప్‌లైన్‌ను దిగువ ప్రాంతంలో ఉన్న చాకలి కుంటలో కలిపేందుకు ప్రయత్నం చేయగా రజకులు పనులను అడ్డుకున్నారు. దీంతో మండల ఏఈ జగపతిబాబు సోమవారం రజకుల చర్చించారు. ఈ డ్రైనేజీని చాకలి కుంటలో కలిపితే 50 కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని రజకులు అధికారికి తెలిపారు. అదేవిధంగా కాలనీవాసులు అనారోగ్యం బారిన పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏఈ జగపతిబాబుతో పాటు, రజకులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పరిగి/మోమిన్‌పేట్/దోమ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిగి ఎంపీడీవో ఎంఎ కరీం అన్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లి, రాపోల్, సయ్యద్‌పల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. అదేవిధంగా మోమిన్‌పేట్ మండలంలోని నందివాగు ప్రాజెక్టు, కాస్లాబాద్, రాళ్లగూడుపల్లి, రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాన్ని డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ పరిశీలించారు. పురాతన భవనాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని దోమ తహసీల్దార్ గోవిందమ్మ సూచించారు. చెరువులు, కుంటల దగ్గరికి వెళ్లరాదన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కీసర రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రీ హాబిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. మల్కాజ్‌గిరిలోని వినాయక్‌నగర్‌కు చెందిన కృష్ణగౌడ్(52) మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానిపించాలని కుటుంబసభ్యులు ఆయనను నాగారం మున్సిపాలిటీ ఎస్వీనగర్‌లో కొనసాగుతున్న జ్యోతి రీహాబిటేషన్ సెంటర్‌లో ఏడాది కిందట చేర్పారు. కాగా సోమవారం సెంటర్ నిర్వాహకులు కృష్ణ కూతురుకు ఫోన్‌చేసి కృష్ణగౌడ్ మృతి చెందాడని తెలిపారు. దీంతో వారంతా హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అతడి ఒంటిపై గాయాలుండటాన్ని గమనించారు. సెంటర్ నిర్వాహకులు విచక్షణా రహితంగా కొట్టడంవల్లే కృష్ణ మృతిచెందాడని బోరున విలపించారు. అలవాట్లు మనిపిస్తారని సెంటర్‌లో చేర్పిస్తే ప్రాణాలు తీశారని ఆవేదన వ్యక్తంచేశారు. కృష్ణ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి కుటుంబసభ్యులు కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా రీ హాబిటేషన్ సెంటర్ నిర్వాహకుడు పరారీలో ఉండటం గమనార్హం.

పర్మిట్‌రూంలో పేకాడుతున్న వారిపై కేసు

తాండూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పర్మిట్‌రూంలో పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని చించోలి రోడ్డు మార్గంలో ఉన్న మద్యం దుకాణం వద్ద పర్మిట్ రూంలో పేకాడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడులు నిర్వహించి పేకాడుతున్న గొల్ల చెరువుకు చెందిన ఎండి షాద్‌ఖాన్, షేక్ అన్వర్ పాషా, ఎండీ మహబూబ్, వినాయకచౌక్‌కు చెందిన షేక్‌సాజిద్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1470లను స్వాధీనం చేసుకున్నారు. వారిని పట్టణ పోలీసులకు అప్పగించారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

పూడూరు, ఆగస్టు 18, (ఆంధ్రజ్యోతి): పూడూరు గేటు వద్ద సోమవారం కుక్కల దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. నెల రోజుల్లో 20-30 మంది వరకు కుక్కల కాటుకు గురవుతున్నారని ప్రజలు తెలిపారు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని మండల ప్రజలు కోరారు.

తాండూరులో కుర్చీలాట

(ఐదో పేజీ తరువాయి)

అప్పగించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్ మధ్య విభేదాలు చోటు చేసుకోగా రాజకీయంగా చర్చ కొనసాగింది. అలాగే ఉమేశ్‌పై ఫిర్యాదులు రావడంతో ఆయనను బాధ్యతల నుంచి తప్పించి వార్డు అధికారిగా నియమిస్తూ ఈనెల 1వ తేదీన ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన స్థానంలో తిరిగి వెంకటయ్యను ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం తొలగించబడిన ఉమేశ్ కుమార్‌కు, వెంకటయ్యకు ఇద్దరికీ వార్డులను విభజిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే వార్డుల విభజన జరిగినా.. ఉమేశ్ మాత్రం మొత్తం తానే శానిటరీ ఇన్‌స్పెక్టర్ గా వ్యవహరిస్తున్నారని, విభజన ప్రకారం ఇద్దరికీ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించకపోవడంపై అధికార కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం ఎమ్మెల్యే వరకు వెళ్లింది. మరోవైపు ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నేనంటే నేను ఉన్నానని మున్సిపల్ జవాన్లు, కార్మికులకు ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో శానిటేషన్‌లో ఇంతకీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎవరన్నది తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారాన్ని త్వరగా పరిష్కరించకపోతే శానిటేషన్ ఇబ్బందులు ఏర్పడే అవకాశం లేకపోలేదు.

ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి




మండపాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ధర్మకర్తలు

వికారాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బుగ్గ శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ధర్మకర్తలు ఎస్.ఆత్మలింగం, మల్లికార్జున్‌లు అన్నారు. శ్రీసాయి డెంటల్ కాలేజ్ ఆఫ్ సర్జరీ, కిరాణా అండ్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్‌తో పాటు పలువురు దాతలు అందించిన ఆర్థిక సాయంతో బుగ్గ దేవాలయం ఆవరణలో కొత్తగా నిర్మించిన మండప ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విరాళాలు అందించిన శ్రీసాయి డెంటల్ కాలేజ్ ఆఫ్ సర్జరీ చైర్మన్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, కిరాణా అండ్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ బాధ్యులకు, పలువురు దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు ఆత్మలింగం, మల్లికార్జున్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కౌకుంట్ల విజయకుమార్, చెక్క వీరన్న, డాగా, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

మేడ్చల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని పీఆర్‌టీయూటీఎస్ (టీజీఈజేఏసీ) చైర్మన్ రవిప్రకాశ్, సెక్రటరీ జనరల్ వినోద్, జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి ఆనందర్‌రెడ్డిలు కోరారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ ఒకటో తారీఖు ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన నిరసన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు.

శాస్త్ర సాంకేతిక రంగంతో ఎన్నో మార్పులు



మాట్లాడుతున్న ముఖేష్ కుమార్

ఘట్‌కేసర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగంలో సాధించిన ప్రగతితో ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చాయని మైక్రోసాఫ్ట్ ఇండియా పరిశోధన విభాగం మేనేజర్ ముఖేష్ కుమార్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి యంనంపేట్‌లోగల శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నూతన విద్యార్థుల ఓరియేంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ అంటే సమస్యలకు పరిష్కారాలను కనిపెట్టడం మాత్రమే కాదని పనులను భిన్నంగా చేయడమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి విద్యా సంస్థల సీఈవో కె.అభిజిత్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీహెచ్ శివారెడ్డి, అకాడమిక్స్ డీన్ కుమారస్వామి పాల్గొన్నారు.